13వ ఆర్థిక సంఘం.. సిఫార్సులు

పేపర్ - 2, సెక్షన్ - 3

యూనిట్ - 2

Q 13వ ఆర్థిక సంఘం సిఫార్సులను విమర్శనాత్మకంగా పరిశీలించండి.

A అర్ధ సమాఖ్య లక్షణాలు కలిగిన భారత రాజకీయ వ్యవస్థలో కేంద్ర రాష్ట్రాల మధ్య ఆర్థిక వనరుల పంపిణీ హేతుబద్ధంగా జరిపించడానికి, భారత రాజ్యాంగం 280 వ ప్రకరణ కింద ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయడానికి అవకాశం కల్పిస్తుంది. ఇప్పటి వరకు 13 ఆర్థిక సంఘాలు ఏర్పడ్డాయి. 13వ ఆర్థిక సంఘం విజయ్ కేల్కర్ అధ్యక్షతన 2007లో ఏర్పాటైంది. ఇది తన నివేదికను డిసెంబర్ 2009లో రాష్ట్రపతికి సమర్పించింది. కేంద్ర కేబినెట్ దీనిని పరిశీలించి ఆమోదించిన తర్వాత ఫిబ్రవరి 2010లో పార్లమెంట్‌కు సమర్పించారు.

ఆర్థిక సంఘం పరిధి క్రమేణా విస్తృతమవుతోంది. ప్రధానంగా ఇది కేంద్ర రాష్ట్రాల మధ్య వనరుల పంపిణీకి సంబంధించిన సిఫార్సులతోపాటు, ప్రభుత్వ ఖర్చులకు అనుగుణంగా ఉత్పత్తిని పెంపొందించడానికి సిఫార్సులు; పర్యావరణ మార్పులు, పరిసరాల స్థిర పారమ్య (sustainable) ప్రగతికి దోహదం చేసే చర్యలు; వస్తువులు, సేవల చట్టం (Goods and Services Act) ప్రభావం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయం మీద ఏమేరకు ఉంటుందో అంచనా వేయడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చింది.

ముఖ్య సిఫార్సులు...

- కేంద్ర ప్రభుత్వం వసూలు చేసిన పన్నుల్లో రాష్ట్రాలకు 32 శాతం వాటా (ప్రస్తుతం 30. 5 శాతం)
- వస్తువులు, సేవల చట్టం అమలుకు రూప రచన, దానిని అమలు చేయడం వల్ల రాష్ట్రాలకు తక్షణం సంభవించే లోటుకు పరిహారం
- వితత్ సమీకరణ (Fiscal Consolidation)కు సరైన గమ్యాన్ని సూచించడం
- స్థానిక ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వ పన్నుల్లో వాటా
- పర్యావరణ మార్పులు, స్థిరపారమ్య ప్రగతి, ప్రభుత్వ ఖర్చులకు అనుగుణంగా ఉత్పత్తిని పెంచడం మొదలైన అంశాల అమలుకు నిర్దిష్టంగా గ్రాంట్లను విడుదల చేయడం.

ఆర్థిక సంఘం సిఫార్సుల్లో కొన్ని పరిమితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అవి..

1) జనాభా లాభాంశాన్ని (demographic dividend) సద్వినియోగం చేసుకోవడానికి మానవ వనరుల అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలని పేర్కొంటూ అందుకుగాను నిర్దిష్టమైన సిఫార్సులను చేయకపోవడం విచారకరం

2) నిర్దిష్ట కార్యక్రమాల అమలుకు సిఫార్సు చేసిన గ్రాంట్లు అనేక షరతులతో కూడినవి. (ఉదా: పర్యావరణ పరిరక్షణ మొదలైనవి)



3) వితత్ క్రమ శిక్షణ పేరుతో పేద రాష్ట్రాలను మరింత ఒత్తిడికి గురిచేస్తున్నారు.

4) వస్తువులు, సేవల చట్టాన్ని అన్ని రాష్ట్రాలకు ఒకే మాదిరిగా వర్తింపజేయాలని సిఫార్సు చేయడం సహేతుకం కాదు. అన్ని రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు ఒకే రకంగా లేవు.

5) నిర్దిష్ట కార్యక్రమాల అమలు కోసం కేంద్రం, రాష్ట్రాలకు ధన సహాయం అందజేయాలని సిఫార్సు చేయడం హర్షణీయం. కానీ రాష్ట్రాలు తమకు లభించిన ధన సహాయాన్ని వేరే కార్యక్రమాల అమలుకు వినియోగించే ప్రమాదముంది. నివారణ చర్యలేమీ సూచించలేదు.

6) నిర్దిష్ట కార్యక్రమాలకు అందించే ధన సహాయం వాటా, కేంద్రం నుంచి రాష్ట్రాలకు బదలీ అయ్యే వాటాలో చాలా తక్కువ శాతం. కేవలం కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత కార్యక్రమాల అమలుకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చినట్లు కనిపిస్తోంది.

ఈ ఆర్థిక సంఘం సిఫార్సులు ఇంతకుముందు నియమించిన ఆర్థిక సంఘం సిఫార్సులకంటే భిన్నమైనవి, విశిష్టమైనవి. వీటిని సక్రమంగా అమలు చేస్తే ఆర్థిక సౌష్టవాన్ని మరింత పెంపొందించవచ్చు. ప్రధానంగా..

1) స్థానిక ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వ పన్నుల్లో కొంత వాటా. ఇది ఆర్థిక వికేంద్రీకరణకు దోహదం చేస్తుంది.

2) రాష్ట్రాల విత్త సామర్థ్యాన్ని (Fiscal Capacity) అంచనా వేయడానికి ఇది ప్రతిపాదించిన నియమావళి హేతుబద్ధమైంది. ప్రస్తుతం అమల్లో ఉన్న సగటు ఆదాయ పద్ధతికంటే మెరుగైంది. అయితే షరతులతో కూడిన వనరుల బదిలీ రాష్ట్రాల ఆర్థిక స్వాధీనతను దెబ్బతీస్తాయి. 2014-15 సంవత్సరానికి విత్తలోటును మూడు శాతానికి తగ్గించాలని చేసిన సిఫార్సు ఆచరణాత్మకం కాదేమో. రాష్ట్రాల విత్త లోటు వాటి ఆర్థికాభివృద్ధి, రుణాల మీద వడ్డీరేటు, ప్రాథమిక లోటు మొదలైన అంశాలపై ఆధారపడి ఉంటుంది.

Q 'న్యాయ వ్యవస్థకు జవాబుదారీతనం కల్పించడం ఎంతైనా అవసరం' వ్యాఖ్యానించండి.

A ఇటీవల కాలంలో సుప్రీంకోర్టు చూపిస్తున్న చొరవ అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తోంది. స్పెక్ట్రమ్ కేసు, ఆదర్శ్ బిల్డింగ్ సొసైటీ కేసు, కేంద్ర విజిలెన్స్ కమిషనర్ థామస్ నియామకం, కామన్వెల్త్ క్రీడలకు సంబంధించిన కుంభకోణం విషయాల్లో మన దేశ అత్యున్నత న్యాయస్థానం అనుసరిస్తున్న క్రియాశీలత హర్షించదగింది. ఒకవైపు శాసనశాఖ, ఇంకోవైపు కార్యనిర్వాహక వర్గం క్రమేణా ప్రజల విశ్వాసాన్ని కోల్పోతుంటే న్యాయ వ్యవస్థ రాజ్యాంగ పరిరక్షణకు, పౌర స్వేచ్ఛను కాపాడటానికి, అవినీతిని అరికట్టడానికి చొరవ తీసుకోవడం అవసరమే.

ఇందిరాగాంధీ హయాంలో అత్యవసర పరిస్థితి ప్రకటించినప్పుడు న్యాయ వ్యవస్థ ఆశించిన రీతిలో స్పందించలేకపోయినప్పటికీ, 1978 తర్వాత సంభవించిన రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని క్రియాశీల ధోరణి అవలంభించింది. న్యాయమూర్తులు పి.ఎస్. భగవతి, వి.ఆర్. కృష్ణ అయ్యర్ తదితరులు చొరవతో ప్రజాహిత వ్యాజ్యం (Public Interest Litigation) ఆవిర్భవించి, భారతీయ పౌరులెవరైనా న్యాయార్థులు కావచ్చు అన్న స్ఫూర్తికి నిలువుటద్దం పట్టింది.

అయితే కాల క్రమేణా, అనేక సందర్భాల్లో న్యాయ వ్యవస్థ తన పరిధిని దాటి శాసన శాఖ, కార్యనిర్వాహక వర్గాలను అచేతనం చేయడానికి ప్రయత్నిస్తుందనే విమర్శ కూడా వినిపిస్తోంది. ప్రజాస్వామ్యంలో విధానపరమైన నిర్ణయాలు సహజంగా రాజకీయ కోణంలో నిర్దేశితమవుతాయి. వాటి అమలు సాధ్యాసాధ్యాలు కార్య నిర్వాహక వర్గానికి తెలుస్తాయి. ప్రజాస్వామ్యమనే ముక్కాలి పీటలో న్యాయ వ్యవస్థ అతిగా వ్యవహరిస్తే ప్రజాస్వామ్య మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఎ.కె. మాథుర్, మార్కండేయ కట్జూ అభిప్రాయపడినట్లు ''న్యాయ వ్యవస్థ సహేతుకత'' (Judicial Reasonableness) అవసరం. న్యాయమూర్తులు కొందరు '' కోర్టు ధిక్కరణ' అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శ కూడా వినిపిస్తోంది. పై రెండు అంశాలు ఒక ఎత్తయితే, న్యాయ వ్యవస్థ, న్యాయమూర్తుల నియామకాన్ని తామే జరుపుకోవడం, కార్య నిర్వాహక వర్గం (రాష్ట్రపతి, మంత్రి మండలి) ప్రేక్షక పాత్రకు పరిమితం కావడం పౌర సమాజాన్ని కలవర పరుస్తుంది. న్యాయవ్యవస్థకు జవాబుదారీ తనం లేకుండా పోయిందనే విమర్శ తరచుగా వినిపిస్తోంది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న న్యాయమూర్తులు పదవిలో కొనసాగడం (జస్టిస్ దినకరన్, సేన్ తదితరులు), మాజీ ప్రధాన న్యాయమూర్తి బాలకృష్ణన్ సమీప బంధువులు అక్రమార్జనకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నత స్థాయిలోని న్యాయవ్యవస్థ చిత్తశుద్ధి మీద అనుమానాలు రేకేతిస్తున్నాయి. న్యాయమూర్తులను తొలగించే ప్రక్రియ క్లిష్టతరమే కాకుండా, రాజకీయీకరణ కావడం ఇంకో సమస్య. దిగువ స్థాయిలో న్యాయ వ్యవస్థ పని తీరు అంతంతమాత్రంగానే ఉంది. విపరీతమైన జాప్యం, ప్రలోభాలకు లోనై పక్షపాత వైఖరితో తీర్పులిస్తున్నారనే అభిప్రాయం సామాన్య ప్రజానీకంలో ఉంది. సమాచార హక్కు చట్ట పరిధిలోకి అత్యున్నత న్యాయస్థానం రాదనడం, న్యాయమూర్తుల ఆదాయ వివరాలు వ్యక్తిగతమైనవి కనుక వాటిని బహిరంగం చేయనవసరం లేదనడం వంటి సంఘటనలు న్యాయ వ్యవస్థ జవాబుదారీ తనాన్ని శంకిస్తున్నాయి. ఢిల్లీ హైకోర్టు పై వాదనలు తోసిపుచ్చినప్పటికీ, సగటు న్యాయమూర్తి ధోరణి అందుకు భిన్నంగా ఉంది.

రాజ్యాంగ పనితీరును సమీక్షించడానికి నియమించిన జస్టిస్ వెంకటాచలయ్య కమిషన్ (2000-02) న్యాయ వ్యవస్థకు జవాబుదారీ తనం కల్పించడానికి కొన్ని సిఫార్సులు చేసింది. వీటి ప్రకారం..

న్యాయమూర్తుల నియామకంలో కార్యనిర్వాహక వర్గానికి తగిన భాగస్వామ్యం కల్పించాలి. ఈ మేరకు జాతీయ న్యాయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. ఇందులో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, మరో ఇద్దరు సుప్రీం కోర్టు న్యాయ మూర్తులు, కేంద్ర న్యాయ శాఖ మంత్రి, రాష్ట్రపతి నామినేట్ చేసిన ప్రముఖులు సభ్యులుగా ఉండాలి. అలాగే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మరో ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన కమిటీ సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులపై వచ్చిన అభియోగాలను పరిశీలించి తగిన ఆధారాలుంటే ఆ అంశాన్ని న్యాయమూర్తుల విచారణ చట్టం కింద ఏర్పాటు చేసిన కమిటీకి నివేదించాలి. రాష్ట్రపతి నియమించే ఈ కమిటీ విచారణ నిర్వహించి ఆ నివేదికను ప్రధాన న్యాయమూర్తికి సమర్పించాలి. ఆ నివేదికను ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన కమిటీ పరిశీలించి తగిన క్రమశిక్షణ చర్యలను సిఫార్సు చేయాలి. ఆరోపణలు స్వల్పమైనవి అయితే సంబంధిత న్యాయమూర్తిని హెచ్చరించడం లేదా మరో న్యాయస్థానానికి బదిలీ చేయడం; తీవ్రమైన అభియోగమైతే ఆ న్యాయమూర్తి స్వచ్ఛందంగా రాజీనామా చేయాలి. అలా చేయకపోతే 124(4), 217 (1) (బి) రాజ్యాంగ ప్రకరణల మేరకు చర్య తీసుకోవాలి. (పార్లమెంటు తీర్మానం మేరకు రాష్ట్రపతి కళంక న్యాయమూర్తిని తొలగిస్తారు). న్యాయమూర్తులు కేసు విచారణ పూర్తయిన 90 రోజుల్లోపు తీర్పు ఇవ్వాలి. జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ఏర్పాటు చేసే న్యాయ మండలి (Judicial council) న్యాయ వ్యవస్థల వనరులు, మౌలిక సదుపాయాలు, నిర్ణీత సమయంలో కేసులు పరిష్కరించడం మొదలైన అంశాలమీద శ్రద్ధ చూపాలి. కోర్టు ధిక్కరణ కింద శిక్షించే అధికారం సుప్రీం, హైకోర్టులకు మాత్రమే పరిమితం కావాలి. పార్లమెంట్, రాష్ట్ర శాసన సభలు చేసిన చట్టాలు చెల్లవని తీర్పునిచ్చే అధికారం సుప్రీం, హైకోర్టులకు మాత్రమే పరిమితం కావాలి.

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో న్యాయమూర్తుల (విచారణ) బిల్లు, 2006 ప్రవేశ పెట్టింది. లా కమిషన్ సిఫార్సుల మేరకు, న్యాయ వ్యవస్థలో అవినీతిని నిరోధించడానికి, తద్వారా జవాబుదారి తనాన్ని పెంపొందించడానికి ఉద్దేశించాయి. ఈ బిల్లు ప్రకారం జాతీయ న్యాయ మండలి (National Judicial Council) సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులపై అభియోగాలను విచారిస్తుంది. అయితే దీనిలో సభ్యులందరూ న్యాయమూర్తులే. పార్లమెంటరీ స్థాయి సంఘం అందుకు భిన్నంగా ఈ మండలిలో న్యాయమూర్తులతోపాటు మిగిలినవారికి ప్రాతినిధ్యం కల్పించాలని అభిప్రాయపడింది. ప్రస్తుతం అమల్లో ఉన్న న్యాయమూర్తుల విచారణ చట్టం, 1968 సమ

గ్రమైంది కాదు. న్యాయశాస్త్ర నిపుణులు, పౌర సమాజపు ఒత్తిడి మేరకు, కేంద్ర ప్రభుత్వం 2006 న్యాయమూర్తుల బిల్లులో సమూల మార్పులు తెచ్చి న్యాయ ప్రమాణాలు, జవాబుదారి బిల్లు (Judicial Standards and Accountability Bill) 2010ని ప్రవేశ పెట్టింది. దీని ప్రధానాంశాలు..

- న్యాయ మూర్తులు తమ ఆస్తి వివరాలను ప్రకటించాలి. న్యాయ మూర్తులు నిర్దిష్ట ప్రమాణాలు పాటించాలి. సుప్రీంకోర్టు, హై కోర్టు న్యాయమూర్తుల తొలగింపునకు ప్రత్యేక ప్రవృత్తి.
- జాతీయ న్యాయ అవధీనత కమిటీ (National Judicial Oversight Committee), అభియోగాల పరిశీలన కమిటీ (Complaints Scrutiny Panel), విచారణ కమిటీ ఏర్పాటు. న్యాయమూర్తుల అనుచిత ప్రవర్తనపై ఎవరైనా జాతీయ న్యాయ అవధీనత కమిటీకి ఫిర్యాదు చేయవచ్చు.
- న్యాయ మూర్తులను తొలగించడానికి పార్లమెంట్‌లో తీర్మానం ప్రవేశ పెట్టవచ్చు. దీనిని అవధీనత కమిటీకి నివేదిస్తారు.
- న్యాయమూర్తుల మీద అభియోగాలు, విచారణలు రహస్యంగా ఉంటాయి. ఆధారాలు లేకుండా అభియోగాలు చేస్తే శిక్షార్హులు.
- అవధీనత కమిటీ ఫిర్యాదు తీవ్రతను బట్టి హెచ్చరిక లేక న్యాయ మూర్తి తొలగింపునకు సిఫార్సు చేయవచ్చు.

గత సంవత్సరం సుప్రీంకోర్టు ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ''ఇప్పటి వరకు పని చేసిన 16 మంది న్యాయమూర్తుల్లో ఎని మిది మంది అవినీతిపరులే'' అని వ్యాఖ్యానించి అందుకుగాను తనను కోర్టు ధిక్కారం కింద శిక్షించవచ్చని సవాలు విసిరారు. మాజీ న్యాయ శాఖ మంత్రి శాంతి భూషణ్ తనను కూడా ఈ వివాదంలో కక్షి దారుగా చేర్చుకోవాలని అభ్యర్థించారు. ఈ సవాలు మన న్యాయ వ్యవస్థ నిజాయితీకి సవాలు.